## క్లుప్తంగా

### భూ పరిరక్షణ అందరి బాధ్యత

కడప స్పోర్ట్స్: భూ పరిరక్షణ మనందరి బాధ్యత అని సోషల్ ఫారెస్టు డీఎఫ్‌ఓ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌ఓ మాట్లాడుతూ మనందరినీ భరిస్తున్న భూమిని మనమే రక్షించుకోవాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, మొక్కలు పెంచడం చేయాలన్నారు. స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ సమస్త జీవకోటి భారాన్ని మోస్తున్న భూమి పట్ల మనందరం బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ జి. సుబ్బారెడ్డి, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

### మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 24 నుంచి 30 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ చేరదల్చుకున్న విద్యార్థులు ఈ ఎంసెట్ మోడల్ పరీక్షను జయప్రదం చేయాలన్నారు. వివరాలకు 95022 08191 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

### నేడు ధరిత్రీ దినోత్సవ ర్యాలీ

కడప కల్చరల్ : ప్రపంచ ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఉదయం 7 గంటలకు నగరంలో ధరిత్రీ దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నామని పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ ప్రతినిధి ప్రసాదురెడ్డి తెలిపారు. స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూలు నుంచి ఏడురోడ్ల కూడలి మీదుగా పాత కలెక్టరేట్ వరకు ర్యాలీ కొనసాగుతుందన్నారు. ర్యాలీ అనంతరం కడప నగరాన్ని నీమ్ సిటీగా మార్చేందుకు నా చెట్టు–నా బాధ్యత పేరిట నగరంలో 100 మొక్కలు నాటేందుకు విద్యార్థులకు మొక్కలను అందిస్తామని తెలిపారు.

### ఐఈఆర్టీలకు సన్మానం

కడప ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు సేవ చేయడం అభినందనీయం అని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కడపలోని సమగ్రశిక్ష కార్యాలయంలో ఐఈఆర్టీలకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహిత విద్యవిభాగంలో ఐఈఆర్టీలు పోషించాల్సిన విధులు గురించి వివరించారు. అనంతరం ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు ప్రత్యేక సేవ లను అందించిన ఐఈఆర్టీలను ఆయన అభినందించి వారికి ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో సహిత విద్యా కోఆర్డినేటర్ మిట్టా కేశవరెడ్డి, ఏఎంఓ ధనలక్ష్మి, ఏపీఓ రజనీకాంత్‌రెడ్డి, ఏఎస్‌ఓ ఇలియాస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### మూల్యాంకన భత్యం పెంపు హర్షణీయం

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు, సిబ్బందికి ప్రభుత్వం రెమ్యూనరేషన్‌ను పెంచడం అభినందనీయం అని ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ఇందుకు వారు శుక్రవారం కడపలోని మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలను కూడా ప్రభుత్వం ప్రకటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు మురళీ, రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, రామచంద్ర, రామలక్ష్మి, జిల్లా నాయకులు గురివిరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రవిశంకర్, వెంకటసుబ్బయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

### రక్తకొరతను అధిగమిద్దాం



వైవీయూ : బ్లడ్ బ్యాంకుల్లో రక్తకొరత ఉంటోందని, దానిని అధిగమించేందుకు అర్హులు రక్తదానం చేయాలని బ్లడ్ టు లివ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల పవన్‌కుమార్ కోరారు. శుక్రవారం కడప నగరం ఏడురోడ్ల కూడలిలో బ్లడ్ టు లివ్ సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన వారోత్సవాలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కడప రిమ్స్ బ్లడ్ బ్యాంకులో రక్తనిల్వలు తగ్గాయని.. రక్తం అందక ఏ ఒక్కరి ప్రాణం పోకూడదన్న లక్ష్యంతో రక్తదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ మురళీమోహన్ మాట్లాడారు. రక్తదాత కిరణ్, రిమ్స్ వైద్యులు ప్రవీణ్ పాల్గొన్నారు.

# రంజాన్ ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ పండుగ శనివారం నిర్వహించుకునేందుకు సిద్ధం కావడంతో అందుకు తగినట్లుగా నగర పరిధిలోని ఈద్గాలలో సామూహిక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష తెలిపారు. యేటా ఈ పండుగను అత్యంత ఘనంగా నిర్వహించుకుంటామని, ఈ ఏడాది కూడా బిల్టప్ ఈద్గాతో పాటు మామిళ్లపల్లె, దండు షాహీ ఈద్గాలలో కూడా ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బిల్టప్ ఈద్గాలో పెద్దదర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరుగుతాయన్నారు. ఇందుకోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ అన్ని ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రార్థనలకు రానున్న వేలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నీటి సదుపాయం, ఇతర వసతులు కల్పించామన్నారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో పెట్టుకుని ఈద్గా మొత్తం చలువ పందిరి వేయించామని, నమాజు చదివేందుకు అనుకూలంగా మ్యాట్స్ ఏర్పాటు చేశామన్నారు. వీలైనంత వరకు చిన్న పిల్లలను ఈద్గాల వద్దకు తీసుకు రావద్దని ఆయన సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మూడురోజులుగా ఈద్గాలను ప్రార్థనలకు సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, ఇతర నాయకులు సుబ్బారెడ్డి, అహ్మద్, టీపీ వెంకటసుబ్బయ్య, మున్సిపల్ డీఈ కరీముల్లా, ఏఈ దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.



బిల్టప్ ఈద్గాలో ఏర్పాట్లు పరిశీలించి మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

**రంజాన్ ప్రార్థన సమయాలు**

ఈదుల్ ఫితర్ సందర్భంగా కడప నగరంలోని 89 మసీదులు, ఈద్గాలలో పండుగ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దండు షాహీ ఈద్గాలో 11.15 గంటలకు, అమీనియా బిల్టప్ ఈద్గాలో 10.30, అలె హదీస్ ఈద్గాలో 7.00 గంటలకు, మనారుల్ హుదా (జమాల్‌పల్లె) ఈద్గాలో 7.30 గంటలకు, రిమ్స్ వద్దగల ఈద్గాలో 7.30 గంటలకు ప్రార్థనలు నిర్వహించనున్నారు.

మసీదుల్లో.. సాయిపేట బొగ్దాదియా మసీదులో ఉదయం 7.00 గంటలకు ప్రార్థనలు ప్రారంభించనున్నారు. అగాడిలోని ఇనాయత్‌ఖాన్ మసీదులో 10.00, అల్మాస్‌పేట మసీదులో 10.00, చిలకలబావివీధిలోని బురానుద్దీన్ మసీదులో 8.00, బీకేఎం వీధిలోని బహదూర్‌ఖాన్ మసీదులో 10.30, అంజదియా మసీదులో 8.00, ఇబ్రహీం ఖలీలుల్లా మసీదులో 10.00, నకాష్ మసీదులో 8.30 గంటలకు, అమీనియా (పెద్దదర్గా) మసీదులో 10.00, తిలక్‌నగర్ బీడి కాలనీ మసీదులో 9.00, సైనిక్‌నగర్‌లోని ఉస్మాన్ మసీదులో 8.30, ఆటోనగర్ మసీదులో 10.00, ఆర్కేనగర్ మదీన మజ్జిద్‌లో 9.00, మద్రాసురోడ్డులోని యతీంఖానా మసీదు 9.00, యాకుబ్ సాహెబ్ మసీదులో 10.30, ఏడురోడ్ల మసీదులో 7.00, గుంతబజారు మసీదులో 11.00, షహమీరియా మసీదులో 7.30, బుఖారియా మసీదులో 7.15, ఏక్ మినార్‌మసీదులలో 7.00, హుజురా మసీదులో 10.00, ప్రకాశ్‌నగర్ మహమ్మదీయ మసీదులో 9.30, కోర్టు ఎదురుగా గల రోషన్ మన్వర్ మసీదులో 10.00, బీకేఎం వీధిలోని ధన్‌మండిమసీదులో 9.30, బ్యాంకు మసీదులో 9.00 గంటలకు ప్రార్థనలు ఉంటాయి. అలాగే మిగిలిన మసీదుల్లో కూడా నిర్ణీత సమయాల్లో ఈద్ ప్రార్థనలు నిర్వహించనున్నారు.

### తోఫా ఇవ్వడం పుణ్యకార్యం



రంజాన్ తోఫా అందిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు

కడప కార్పొరేషన్: రంజాన్ మాసంలో పేదలకు రంజాన్ తోఫా అందించడం పుణ్యకార్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్ బాషా, నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. శుక్రవారం మురళీ థియేటర్ సమీపంలో 23వ డివిజన్ కార్పొరేటర్ తుంగా విజయలక్ష్మి, డివిజన్ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో 400 కుటుంబాలకు 13 రకాల నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై తోఫా కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఏ చైర్మన్ మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్. సుబ్బారెడ్డి, షఫీ, కిరణ్, టీపీ వెంకట సుబ్బమ్మ పాల్గొన్నారు.

### అసాంఘిక శక్తులను కట్టడి చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలో అసాంఘిక శక్తుల అరాచకాలను కట్టడి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని మున్సిపల్ గ్రౌండ్‌కు వెళ్ళి వచ్చే ఓ మహిళ మెడలో నుంచి చైన్ స్నాచింగ్ చేసిన నేపథ్యంలో వాకింగ్ కోసం మహిళలు మెడలో బంగారు గొలుసులు లేకుండా రావాలని స్టేడియం సిబ్బంది చెప్పడం సరికాదన్నారు. పండుగ సమయాల్లో నగరంలోని వైవీ స్ట్రీట్, బీకేఎం స్ట్రీట్‌లో దొంగల హవా పెరిగిపోయిందన్నారు. వెంటనే పోలీసులు దొంగతనాలను అరికట్టాలన్నారు.

### బియ్యం పంపిణీ

కడప ఎడ్యుకేషన్: మానవసేవే మాధవసేవ అని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని శుక్రవారం కడపలోని సమగ్రశిక్ష కార్యాలయం వద్ద దాతలు జమాల్, రామేశ్వరం చెన్నయ్య, సుభాన్, ప్రవీణ్, శ్రీధర్‌ల సహకారంతో పేద ముస్లిం కుటుంబాలకు ఒకొక్కరికి 25 కేజీల బియ్యాన్ని అంబవరం ప్రభాకర్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్టీ కో ఆర్డినేటర్ మిట్టా కేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కందనూరు వెంకటసుబ్బారెడ్డి, ఎస్‌ఎస్‌ఓ ఇలియాస్‌ఖాన్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీటెక్ రవి ప్రజలకు క్షమాపణ చెప్పాలి

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బూసిపాటి కిషోర్

కడప కార్పొరేషన్: పులివెందుల నియోజకవర్గ ప్రజలకు మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి బహిరంగ క్షమాపణ చెప్పాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బూసిపాటి కిషోర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓ టీవీ ఛానెల్‌కు బీటెక్ రవి ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. బీటెక్ రవి పులివెందుల చరిత్ర గూర్చి చెప్పకుండా సిగ్గూ, లజ్జ విడిచి ఇంటర్వ్యూను కొనసాగించడం దారుణమన్నారు. ముందే రాసుకున్న స్క్రిప్టు ప్రకారం వారి ఇంటర్వ్యూ సాగిందన్నారు. హైదరాబాద్‌లో జూబ్లీహిల్స్‌లోని తన ఇంటిలో పేకాట ఆడుతూ బీటెక్ రవి పట్టుబడ్డారని, బెంగళూరులో పేకాట క్లబ్‌లు నిర్వహిస్తూ, అసాంఘీక కార్యకలాపాలు సాగిస్తుంటారని ఆరోపణలు ఉన్నాయన్నాయన్నారు. వీటి గూర్చి ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడిగి ఉంటే బాగుండేదని ఎద్దేవా చేశారు. వైఎస్ వివేకా హత్య కేసును అన్ని కోణాల్లో విచారించి నిజమైన దోషులను శిక్షించాలని, సంబంధం లేని వారిని ఇందులో ఇరికించవద్దని తాము సీబీఐని కోరుతున్నామన్నారు. కొన్ని పత్రికలు, కొన్ని ఛానెళ్లు స్వయంగా చూసినట్లు, విన్నట్లు కథనాలు వండి వారుస్తున్నాయన్నారు. బహిరంగ క్షమాపణ చెప్పకుండా పులివెందుల్లో తిరిగే అర్హత బీటెక్ రవికి లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ మాట్లాడుతూ దేశ చరిత్రలో పులివెందులకు ఒక ప్రత్యేక స్థానముందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పి. సంపత్ కుమార్, శ్యాంసన్, బండి వెంకట రమణ, లక్ష్మినారాయణ, మనోజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కిశోర్

### అంగన్వాడీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలోని మినీ అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అంగన్వాడీ మినీ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ పీడీ రాణికి ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్ళు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

### మార్కెట్ యార్డులో సదుపాయాలు కల్పించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మౌళిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని మార్కెట్ యార్డులో పసుపు పంటను సీపీఐ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు పంట రైతులకు కనీస మద్దతు ధర రూ. 15 వేలు ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, గంగా సురేష్, వలరాజు, జయన్న, బాల చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

### శంకరాపురంలో చైన్‌స్నాచింగ్

కడప అర్బన్: కడప నగరంలోని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శంకరాపురం నమస్తే బోర్డు సమీపంలో శుక్రవారం చైన్ స్నాచింగ్ జరిగింది. సత్య అనే మహిళ నడుచుకుంటూ వెళుతుండగా గుర్తు తెలియని దుండగులు వచ్చి ఆమె మెడలోని మూడున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కుని వెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### శ్రమదానం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్–1 వలంటీర్లు ప్రత్యేక శిబిరంలో భాగంగా 5వ రోజు కొప్పర్తి పారిశ్రామికవాడను సందర్శించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. పి. సరిత పర్యవేక్షణలో ట్రియోవిజన్ సంస్థ పరిసరాలను శుభ్రం చేసి కంపెనీ సమీపంలోని ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేశారు. వ్యర్థాల తొలగింపు, వ్యర్థ పదార్థాల నిర్వహణ ప్రక్రియను గురించి కంపెనీ వ్యక్తులతో చర్చించారు. అనంతరం సమీపంలోని ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామంలో రావి, కానుగ మొక్కలు నాటారు.







# డ్రైవర్లు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పనిచేస్తున్న డ్రైవర్లు చిత్తశుద్ధితో పనిచేసి సంస్థ పురోభివృద్ధికి కృషి చేయాలని డీపీటీఓ గోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలోని ఆర్‌ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో కేఎంపీఎల్ పెరుగుదల లేని డ్రైవర్లకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు మద్యం సేవించి విధులకు రావడం, అకారణంగా విధులకు గైర్హాజరు కావడం, ప్రయాణీకుల పట్ల దురుసుగా ప్రవర్తించడం, ర్యాష్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ను మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి కడప డిపో నుంచి 8 మంది, పులివెందుల 5, బద్వేలు 3, జమ్మలమడుగు 3, మైదుకూరు 1, ప్రొద్దుటూరు డిపో నుంచి ఐదుగురితోపాటు హైర్ బస్సుల ఇరువురు డ్రైవర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డిపో మేనేజర్ రామకృష్ణ, ట్రైనర్, యూనియన్ నాయకులు, ఉద్యోగులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న ట్రైనర్

### ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ జోషి ప్రకాష్ మృతి



జోషి ప్రకాష్

కడప కార్పొరేషన్: జిల్లా ఖజానా శాఖ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న గొల్లపల్లె జోషి ప్రకాష్(53) కన్నుమూశారు. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ఆయన గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. జోషి ప్రకాష్ స్వగృహానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా వెళ్లి ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

### చేతుల శుభ్రతతో ఆరోగ్యం

కడప ఎడ్యుకేషన్: చేతుల శుభ్రంతోనే ఆరోగ్యం పదిలమని డెటాల్ బనేగా స్వస్థ ఇండియా పోగ్రాం మేనేజర్ కుమారి అన్నారు. కడప చెమ్మియాపేట బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు సార్ప్, గ్రామలయ స్వచ్ఛంద సేవాసంస్థ, డెట్టాల్ బనేగా స్వస్థ్ ఇండియా ఆధ్వర్యంలో శుభ్రత, పరిశుభ్రత మీద అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకోకుండా ఆహారం తింటే చేతుల్లో ఉన్న బాక్టీరియా నోటిలోకి వెళ్లి వివిధ రకాల వ్యాధులు వస్తాయన్నారు. కార్యక్రమంలో పోగ్రాం కో ఆర్డినేటర్ విష్ణువర్ధన్, పాఠశాల హెచ్‌ఎం మేరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# కనుల పండువగా హేలాంబ తిరునాల

కమలాపురం : మండల పరిధిలోని పెద్దచెప్పలిలో వెలసిన హేలాంబ అమ్మవారి తిరునాల మహోత్సవం వైభవంగా జరిగింది. ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతున్న ఈ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రధాన తిరునాల జరిగింది. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మాచునూరు ఇంద్రావతమ్మ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి బంగారు కిరీటం, బంగారు చీర, ఆభరణములను ఊరేగింపుగా తీసుకువచ్చి అలంకరించారు. అనంతరం గ్రామంలోని పలు వీధుల గుండా ఈ ఊరేగింపు సాగింది. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్, సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.

**జనసంద్రమైన పెద్దచెప్పలి:**

పెద్దచెప్పలి హేలాంబ తిరునాల జిల్లాలో ప్రఖ్యాతి గాంచడంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో పెద్దచెప్పలి గ్రామం జనసంద్రంగా మారింది. భక్తులకు నిర్వాహకులు అన్నిఏర్పాట్లు చేశారు. అలాగే దాతలు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.ఆలయ సమీపంలో రాత్రి రాష్ట్రంలోనే ప్రఖ్యాతి గాంచిన కళాకారులచే శ్రీరామాంజనేయ యుద్ధం, దేవ నర్తకి నాటకాలు ప్రదర్శించారు.



బంగారు చీర అలంకరణలో అమ్మవారు

**అట్టహాసంగా బండ లాగుడు పోటీలు**

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 11 కాండ్ల ఎద్దుల జతలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కాగా ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మన్, సీకేదిన్నె జడ్పీటీసీలు ఈ పోటీలను ప్రారంభించారు. బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. చీకటి పడే వరకు పోటీలు నిర్వహించారు. మిగిలిన వాటికి శనివారం పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రథమ బహుమతి రూ.1 లక్షతో పాటు మొత్తం 11 బహుమతులు ప్రకటించారు.

### జూదరుల అరెస్ట్

కడప అర్బన్: చిన్న చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ లాడ్జిలో శుక్రవారం మంగతాయి అనే జూదం ఆడుతున్న ఆరుగురిని సీఐ శ్రీరామ్ శ్రీనివాసులు, ఎస్‌ఐలు తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ. 26,600 నగదును, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు.

### ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణస్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో టైలరింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈనెల 24వ తేది నుంచి నెల రోజులపాటు ఆయా కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన నిరుద్యోగ మహిళలు శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. వివరాలకు 94409 05478, 63028 33546 సంప్రదించాలన్నారు.







# కూలిన చెట్లు

కడప అర్బన్: కడప నగర శివార్లలోని రిమ్స్‌కు వెళ్లే రహదారిలో, ఐపీ విభాగం ముందుభాగాన మూడు చెట్లు కూలిపోయాయి. శుక్రవారం రాత్రి వచ్చిన గాలీ వానకు రిమ్స్‌కు వెళ్లే దారిలో రెండు చెట్లు ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో ట్రాఫిక్‌లో వెళుతున్న వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అలాగే రిమ్స్ ఐపీ ముందు క్యాంటిన్ కాంప్లెక్స్ వద్ద వున్న చెట్టు కూలిపోయింది. ట్రాఫిక్‌లో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కడప రిమ్స్ ఐపీ విభాగం రహదారిలో కూలిన చెట్టు

